


# మూడు లాంతర్లు

పి.ఎల్.ఎన్. చంద్రశేఖర్

**రాత్రి పన్నెండు గంటలవేళ... సన్నగా చినుకులు మొదలయ్యాయి. ఓపక్క రివ్వున వీస్తున్న చలిగాలి. ఊరంతా చీకటి. కరెంటు లేదు. ఆఫీసు నుంచి ఊళ్లోకి వెళ్ళాలంటే ఎంతలేదన్నా అరగంట పడుతుంది. అదీ చేతిలో చేతక్ ఉంది కాబట్టి... ఇప్పటికే అరగంట లేటు...**

నా కోసం రాజుగారు, కృష్ణాజీ, సాయిబాబా, హెడ్మాష్టారు హోటల్లో వెయిట్ చేస్తుంటారు. వెంటనే బండి స్టార్ట్ చేశాను. కాస్తంత వేగంగానే బండి నడుపుతున్నాను... రోడ్డమ్మట దీపాలు వెలగటం లేదు. ఆ చీకట్లో, ప్రదీప్‌నగర్ చెరువు మలుపు దగ్గర కాస్తంతలో యాక్సిడెంట్ తప్పించుకున్నా... ఎదురుగా క్వారీ లారీ... సింగిల్ లైట్‌తో వస్తున్నాడు... అదీ మెరుపువేగంతో, ఎలా తప్పించుకున్నానో నాకే తెలీదు... స్కూటర్ ఓ పక్క, నేనో పక్క. సెకండ్‌షో సినిమాకెళ్ళి వస్తున్న పల్లీయులే నన్ను కిందనుంచి లేపారు. మోచేతుల దగ్గర చీరుకుపోయింది. కాస్తం నొప్పనిపించినా, డ్రైవ్ చేయగలనన్న నమ్మకం వచ్చింది... స్కూటర్ కండిషన్ చూస్తే పర్లేదనిపించింది... పాపం ఆ స్కూటర్ లేపి నా కందించటానికి, ఆ పల్లీయులే తోడుపట్టారు. వాళ్ళవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూడటం తప్పించి, మరేమీ చేయలేకపోయాను. స్కూటర్ స్టార్ట్ చేసింతర్వాత, హెడ్‌లైట్ వెలుగులో నాకు సాయమందించిన పల్లీయుడి ముఖం చూశాను. ఎందుకో అతడ్ని చూస్తుంటే, ఇంతకుముందెక్కడో చూసినట్లనిపించింది. 'జాగ్రత్తగా వెళ్ళండి బాబయ్యా' చిరునవ్వుతో చెప్పినా, నన్ను హెచ్చరించినట్లు చెప్పాడతను. అనాలోచితంగా స్కూటర్ ముందుకు పోనిచ్చాను కానీ, నామనోనేత్రం ముందు అతడే మెదులుతున్నాడు.... ఎక్కడో చూశాను... ఆ ఎక్కడనేదే గుర్తుకు రావటం లేదు. నా ఆలోచనలమధ్యే రాజుగారి పర్ణశాల దగ్గరకొచ్చేశాను... స్కూటర్ స్టాండేశానన్న మాటేగానీ, నాకా పల్లీయుడే గుర్తొస్తున్నాడు... మనసంతా చాలా గందరగోళంగా తయారైంది... అతని వేరెబవుట్స్ అడిగుంటే బాగుండేదేమోననుకున్నా.... కానీ, ఇప్పుడు మళ్ళీ వెనక్కెళ్ళాలనుకున్నా కష్టమే, వర్షం జోరందుకుంది.... అప్పటికే సగం దాకా తడిసిపోయాను...

"లోపలికి రండి సార్, బయటే నుంచున్నారేంటి?" అంటూ కృష్ణాజీ కేకేయటంతో ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాను.... "ఏందో ఆలోచిస్తున్నట్లున్నారు...." లోప

లికొస్తున్న నావైపు చూస్తూ రాజుగారన్నారు. "అరేయ్ ఆదీ, రాముగారికి టవలందించరా" అంటూ కృష్ణాజీ సప్లయర్‌ని పురమాయించారు. "ఏంటి మాస్టారూ... మీ చేతుల దగ్గరేంటి రక్తం?" కాస్తంత ఆందోళనతో అడిగారు సాయిబాబా, హెడ్మాస్టరూ... ఇక్కడ మీకో విషయం చెప్పాలి. హెడ్మాస్టరంటే నిజంగా హెడ్మాస్టరు కాదు, నాతోటి పాత్రికేయుడే ఆయన కూడాను, కానైతే నాకు తల్లో నాలుకలా ఉంటాడని ఆయనకి హెడ్మాస్టరనే పేరు పెట్టాన్నేను.... దాంతో మా మిత్రులందరికీ కూడా ఆయన హెడ్మాస్టరైపోయారు. ఆయనతోటే నేనెక్కువగా చర్చలు, గోష్ఠులు నిర్వహిస్తుంటానని నన్ను మాస్టార్ని చేశారు మిత్రులంతా... ఆ విషయమటుంచితే,.... "ఆ ఏం లేదులే... చిన్న యాక్సిడెంట్" అంటూ చెప్పేశా. అయితే ఆదిగాడు ఉరఫ్ రాంభక్త హను నాకు టవలందిస్తూ కెవ్వున అరిచాడు "అయ్ బాబాయ్... బోల్డంత రక్తం" అంటూ వెంటనే రాజుగారు కౌంటర్ దిగొచ్చారు, కృష్ణాజీ సిగరెట్ పీక పారేశారు. హెడ్మాస్టరు, సాయిబాబా కూడా ఆదుర్దాగా కుర్చీల్లోంచి లేచి నాదగ్గరకొచ్చారు. కౌంటర్‌లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ తీసి, సామూహికంగా చికిత్స చేశారు. ఈ తతంగమంతా అయ్యేసరికి పన్నెండున్నర అయింది. రాజుగారు ఏదైనా ఒప్పుకుంటారుకానీ, భోజనం చేయకపోతే మాత్రం కోప్పడతారు. ఎంతలేటైనా సరే, మజ్జిగన్నం అయినా తినమంటారు... "ఒరేయ్ ఆదీ, పన్నెండున్నర, మీల్స్ పట్రారా" అంటూ కేకేశారు రాజుగారు. వాతావరణాన్ని తేలిక పర్చటానికి. వెంటనే అడిగారు నా టేబుల్ ముందు ఆకేసి, నీళ్లతో వాడే కడిగేశాడు. ఐటమ్స్ అన్నీ ఒకదానెమ్మటి ఒకటి వడ్డిస్తున్నాడు...

వాడంటే నాకెందుకో ఎఫెక్షన్, రాజుగారికి నామీదున్న ఎఫెక్షన్ లాంటిదే. రోజూ నా డ్యూటీ ముగించుకుని, రాజుగారి పర్ణశాల దగ్గరకొచ్చేటప్పటికి రాత్రి పన్నెండున్నరవుతుంటుంది. అందుకనే నాది పన్నెండున్నర మీల్స్ అని రాజుగారి హాసికాలాడుతుంటారు. అనాలోచితంగా, పర్యధ్యానంగా భోజనం చేస్తున్న సాయిబాబా చూపులు గట్టిగా పట్టేశాయి. "ఏంటి మాస్టారూ... ఏంటి, ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు?" అడిగాడు. చాలా డిస్క్రీట్‌గా చెప్పా నేను, ఇందాక జరిగిన విషయం గురించి, ఆ పల్లీయుడెవరో గుర్తుకురావటం లేదని, ఎంత ఆలోచించినా... "గుర్తు తెచ్చుకోండి మాస్టారూ, అదే గుర్తుకొస్తుంది" అన్నాడు సాయిబాబా. "కష్టం బాబా" అన్నా, అన్నంలో చారు కలుపుకుంటూ. మరోసారి ట్రై చేయమన్నారు హెడ్మాస్టారు, రెండోసారి మీతా కిళ్ళీ బిగిస్తూ. అలా మిత్రులంతా ఒక్కమ్మడిగా ఒత్తిడి చేస్తుంటే, నా ఆలోచనలు కూడా రెండేళ్ళు వెనక్కు పరుగులు తీశాయి. లీలగా గుర్తొస్తున్న సంగతులను వరస క్రమంలో పెట్టుకుంటూ బాబాతో చెప్పాను.

"బాబా, నేనీ ఊరు వచ్చినప్పటినుంచి జరిగిన మూడే మూడు సంఘటనలు ఇప్పటికే నాకు తరచూ గుర్తొస్తుంటాయి" పెరుగన్నం చివరిముద్ద నోట్లో పెట్టుకుంటూ చెప్పాను. రాజుగారు, కృష్ణాజీ, బాబా, హెడ్మాస్టారూ— అందరు మిత్రులూ ఆసక్తిగా ఒక్కసారిగా అడిగారు "అయితే, మా క్కూడా అవేంటో చెప్పాలి" అని చిన్నగా నవ్వి "చెప్తాను" అన్నాను. కుర్చీలోంచి



నిన్న క్రికెట్ మ్యాచ్‌లో నేను
రికార్డ్ బద్దలు కొట్టాను.
నిజమే ఆ ఆటలో ఏదోకటి
బద్దలవుతూనే వుంటుంది. మొన్న
మా తమ్ముడు కిటికి
అద్దాలు బద్దలుకొట్టాడు

లేస్తూ... చేతులు కడుక్కొచ్చిన తర్వాత, ఆదిగాడు టవలందించాడు తుడుచుకోవటానికి... బయట వర్షం కుండపోతగా కురుస్తోంది. ఊరవతల కరెంట్ తీసేసిన ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ మహాశయులు టౌన్‌వాళ్ళమీద దయుంచడంతో ఇంకా ఇక్కడ మాత్రం కరెంట్ పోలేదు.

"ఆదిగా, ఫ్లాస్కులో కాఫీ ఐదు కప్పుల్లో పోసియ్యరా" అంటూ కృష్ణాజీ నావైపు తిరిగారు ఇకమొదలెట్టమన్నట్లు... అడిగాడు కాఫీ పంచే కార్యక్రమంలో నిమగ్నమయ్యాడు. ఆరోజు బుధవారమనుకుంటా... సరిగ్గా గుర్తులేదు... విజయనగరంలో కోణార్క్ దిగేప్పటికి తెల్లవారుఝామున మూడున్నరయింది. స్టేషన్ బయట జనవరి చలి ఒక్కసారిగా నామీద దాడిచేసింది. లాభం లేదన్నట్లు బ్యాగులోంచి మఫ్లర్ తీసుకుని తలకు చుట్టుకుని స్టేషన్ ముందున్న పాక హోటళ్ళవైపు నడక సాగించాను.

"ఏంటి సార్... టీ, కాఫీ, ఏటికావాలి?" ఉత్తరాంధ్ర భాషలో అడిగాడు ఓ టీస్టాల్ బాబయ్య. "మాంచి స్ట్రాంగ్ టీ" అప్రయత్నంగా అనేశా. "లోనికి రండి సార్" అంటూ, భుజంమీది కండువాతో టీస్టాల్ బెంచిమీద దుమ్ముదులిపాడు. కూర్చున్న తర్వాత టీ అందించాడు. "సారూ, ఏటి రూమ్ కావాలా?" అవునన్నట్లు తలూపాను. "పాతిక రూపాయల్లో... అన్నీ ఉంటాయి సార్, అన్నీ...." అన్నాడు. టీ కప్పు, పక్కన పెట్టేసి తీక్షణంగా చూశా... నా చూపులకు తడబడ్డాడతను. "మంచి హోటలే ఉంది సార్. గంటస్థంభం కాడికెళితే..." తలొంచుకుని బుర్ర గోక్కుంటూ చెప్పాడతను. అతనే రిక్షా పిలిచాడు. "బాబుగార్ని కలాన్ హోటల్‌కాడ దించిరా" అని పురమాయించాడు... రిక్షా స్టేషన్ దగ్గర్నుంచి పెదచెరువుమీదుగా పరుగులు తీసింది. హోటల్ దగ్గర ఆగింది. ఎ.సి. హోటల్... రిక్షాకు డబ్బులిచ్చేసి పంపించాను. బ్యాగ్ తీసుకుని రిసెప్షన్ కౌంటర్ వైపు నడిచాను...

కౌంటర్‌లో ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్నాను. బాయ్ నా బ్యాగ్ తీసుకుని రూమ్‌వైపు నడిచాడు. నేనూ అతన్ని ఫాలో అయ్యాను. రూమ్‌లో బెడ్‌మీద దుప్పటి మార్చి, ఎ.సి. ఆన్‌చేసి చెప్పాడు. "ఏమన్నా కావాలంటే, బెల్ నొక్కండి బాబూ" అని... సరేనని తలూపా... అతనెళ్ళిన తర్వాత డోర్ లాక్‌చేసి వచ్చి మంచంమీద వాలాను. ప్రయాణపు బడలిక మీదున్నానేమో, మా గన్నుగా నిద్రపట్టింది. ఇంతలో, ఎప్పుడు కరెంట్‌పోయిందో, ఏమో ఎ.సి అగిపోవటంతో మెలకువ వచ్చింది. బెడ్‌మీద చాలా అనీజీగా కదిలాను. ఆ గదిలో ఇంకెవరో ఉన్న ఫీలింగ్, ఆ వ్యక్తి నన్నే చూస్తున్న భావన నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. కాసేపు బెడ్‌మీద అటూ ఇటూ దొర్లాను. ఆ తర్వాత వెల్లకిలా పడుకున్నాను. కళ్ళు మూసుకున్నానన్న మాటేగానీ, ఆ కానరానివ్యక్తి తీక్షణంగా నావైపే చూస్తున్నాడన్న భావన నన్ను వీడలేదు. లాభం లేదని నెమ్మదిగా కళ్ళు తెరిచి చుట్టూరా చూశా. ఎవరూ లేరు... "అమ్మయ్య" అని ఊపిరి పీల్చుకుంటూ అప్రయత్నంగా గది సీలింగ్ వైపు చూశా...

వెంటనే అదిరిపడ్డాను. గుండె నిమిషానికి రెండింతల వేగంతో కొట్టుకోవడం మొదలెట్టింది. గది రూఫ్ లోంచి ఓ వ్యక్తి తల నావైపు పలకరింపుగా చూసి నవ్వింది. ఆ తలకూడా రూఫ్‌కు అతుక్కునే ఉంది. నాకొక్క క్షణం ఏమైందో అర్థం కాలేదు. పరిస్థితి అర్థం కాగానే వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. "ఈ ఊరికి కొత్తగా వచ్చారా?" చుట్టూరా చూశా, ఎవరయ్యుంటారా ఆ ప్రశ్న అడిగిందని. "మిమ్మల్నే, పైకి చూడండి..." ఆ తల మాట్లాడుతోంది. "ఆ... అవును" గుటకలేస్తూ బదులిచ్చాను. "మరేం ఫర్లేదు. భయపడకండి. నేను మీ మిత్రుడులాంటి వాణ్ణి" ఆ తల ఊరడింపుగా మాట్లాడడంతో, నా బుర్ర తిరిగిపోయింది. ఆ తల పలకరింపుగా నవ్వడమే కాకుండా, మాట్లాడటం కూడా చేస్తుంటే నా భయం పెరిగిపోతోంది. "నేను మిమ్మల్నేం చేయను. భయపడకండి. రాత్రిళ్ళు నేనిలా రూఫ్‌మీదే రెస్ట్ తీసుకుంటుంటాను" మళ్లీ ఆ తల మాట్లాడింది. "మరి పగలు..." కాస్తంత భయం తగ్గటంతో ఎదురు ప్రశ్నించాను. "పగటిపూట ఆ అవసరం ఉండదు నాకు" బదులిచ్చింది ఆ తల. "ఎందుకని?" "కొన్ని ప్రశ్నలకు జవాబులుండవు ఫ్రెండ్" అందా తల. ఆ తలతో ఎక్కువ మాట్లాడటమింక మంచిది కాదనిపించింది.

"తెల్లవారుతున్నట్లుంది. మళ్ళీ రాత్రికి కలుద్దాం ఫ్రెండ్" అని ఆ తల గుడ్‌బై చెప్పటంతో, గోడ గడియారంవైపు చూశా. ఉదయం ఐదున్నర చూపిస్తోంది — గడియారం. వెంటనే రూఫ్‌వైపు చూశా. ఆ తల నెమ్మదిగా కరిగిపోవటం మొదలెట్టింది. ముందు తలమీదున్న గిరిజాల జుట్టు, తర్వాత నుదురు... కళ్ళు... ముక్కు... నెమ్మది నెమ్మదిగా గడ్డం... అలా తల మొత్తం కరిగిపోయింది.... చాలా ఆశ్చర్యం. రూఫ్ ఏమీ ఎరగనట్లు చాలా సాఫీగా ఉంది. అంతకుముందు అక్కడ తల ఉందంటే ఎవడూ నమ్మడు సరికదా, నన్నో పిచ్చివాడిని చూసినట్లు చూస్తారు...

ఆ తల కరిగే కార్యక్రమం చూస్తుంటే, నాకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. అది అక్కడినుంచి అదృశ్యమయ్యేటప్పటికి సమయం ఉదయం ఠంచనుగా

ఆరుగంటలు... వెంటనే లేచి ఆదరాబాదరాగా కాలకృత్యాలు తీర్చుకున్నాను... పదింటికల్లా బయటపడి నేను జాయినవ్వాల్సిన పత్రికాఫీసుకెళ్ళి జాయినింగ్ రిపోర్టిచ్చాను. ఆ రోజుకి పరిచయ కార్యక్రమాలైంతర్వాత, సాయంత్రం ఐదు గంటల సమయంలో బయటపడ్డాను... తిన్నగా నేను బస చేసిన హోటల్‌కెళ్ళి, రిసెప్షన్‌లో చెప్పాను రూమ్ ఖాళీ చేస్తున్నట్టు... బాయ్‌నే రూమ్‌లో నా బ్యాగ్ సర్ది బయటకు తీసుకు రమ్మని చెప్పా... ఎందుకంటే, అప్పటికి సాయం సంధ్య కనుమరుగై, చీకట్లు పరుచుకుంటున్నాయి... రూమ్‌లో కెళితే ఎక్కడ మళ్ళీ ఆ తల నన్ను భయపెడుతుందేమోనన్న భయం, ఆందోళన నేను చాలా తొందరగా బయటపడ్డానికి దోహదం చేశాయి.

అలా బయటపడ్డ నేను ఊళ్ళో చాలా సాదాసీదా హోటల్‌కి మకాం మార్చాను... అక్కడ కూడా విడిగా రూమ్ తీసుకోకుండా, డార్మిటరీలో ఒక మంచం తీసుకున్నాను... చుట్టూ జనాలుంటారు కాబట్టి, ఇక ఏ తలా నన్ను పలకరించలేదని, నన్ను భయపెట్టలేదనీ అనిపించింది. ఆ రాత్రికి హాయిగా, ప్రశాంతంగా నిద్రపోయాను. మర్నాడే కొలీగ్స్ సాయంతో ఊళ్ళోనే ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నా... ఏకబిగిన చెప్పానేమో, కాస్తంత అలసటగా అనిపించి ఆగాను నేను... మిత్రులంతా చాలా ఉత్కంఠగా వింటున్నట్లున్నారు... "అదీ బాబా నేనీ ఊళ్ళోకొచ్చింతర్వాత మర్చిపోలేని మొదటి సంఘటన" అంటూ —ఆదిగాడివైపు తిరిగి మంచినీళ్ళ కోసం సైగ చేశా. వాడు లోనికెళ్ళగానే రాజుగారితో సహా మిత్రులందరూ అడిగారు —రెండో సంఘటన గురించి చెప్పమని.

ఆదిగాడు తెచ్చిన మంచినీళ్ళు తాగి, అన్నాను "వర్షం తెరిపిచ్చినట్లుంది అలా, మూడు లాంతర్ల దాకా వెళ్ళి టీ తాగుదామా? నడుస్తూ మాట్లాడుకోవచ్చు" నా ప్రతిపాదనకు అందరూ ఓ.కె. అన్నారు. ఆదిగాడు ఎలియాస్ రాంభక్తహనుమాన్ వెంటనే హోటల్ కట్టేసే ఏర్పాట్లలో చకచకా నిమగ్నమయ్యాడు... ఈలోగా మేం ఐదుగురం హోటలు బయటకొచ్చాం. రోడ్డంతా బురద బురదగా తయారైంది. హోటల్ డోర్‌కి తాళం వేసిన ఆదిగాడు బీగాలు రాజుగారి చేతికిస్తూ, "నేను కూడా వస్తా సార్" అని అభ్యర్థించాడు. రాజుగారు వాడి భుజంమీద చెయ్యేస్తూ "సరే, పద" అన్నారు... కృష్ణాజీ సిగరెట్ వెలిగించి, "ప్రొసీడ్" అన్నట్లు నావైపు చూశారు... నేను విజయనగరం వచ్చిన నెల రోజుల తర్వాత అనుకుంటా...

అప్పటికి ఇంకా స్కూటర్ కొనలేదు... కోట జంక్షన్ కొచ్చి సిటీబస్సులోనో, ఆటోలోనో ఆఫీసు కెళ్ళేవాడిని.



చింటు: ఇంత చీకట్లో అంత గబగబా ఎలా చదవగల్గుతున్నావ్?
సాయి: నాలుగు సంవత్సరాలుగా ఈ పుస్తకమేగా చదువుతోంది...

ఆ రోజు ఉదయం కూడా అలాగే ఆటో కోసం ఎదురుచూస్తున్నా... ఇంతలో ఎవరో "సార్" అని నన్ను పిలిచినట్లనిపించింది. నన్నీ ఊళ్ళో అలా ఎవరు పిలుస్తారబ్బా, అసలు నాకీ ఊళ్ళో ఇంకా పరిచయాలే కాలేదే —అనుకుంటూ చుట్టూరా చూశా... మళ్ళీ ఆ కేక వినిపించడంతో, రోడ్డవతలవైపు చూశా... అవతలనుంచి ఓ వ్యక్తి చెయ్యూపుతున్నాడు, గుర్తు పట్టారా అన్నట్లు... నాకో క్షణం అర్థం కాలేదు... పలకరింపుగా నవ్వుతున్నాడు... నవ్వకపోతే బాగోదని నేను కూడా నవ్వుతూ చెయ్యూపాను, అతనెవరో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ... ఇంతలో "మీరక్కడే ఉండండి సార్... నేనే వస్తున్నా... అటువైపు" అంటూ గట్టిగా కేకేశాడు. అయోమయంగా, సరేనన్నట్లు తలూపాను. బ్యాడ్‌లక్... అతనలా రోడ్డు దాటుతుండగా, ఒక క్వారీ లారీ వచ్చి అతడిని గుద్దేసింది. ఆ షాక్‌కి అతను అక్కడికక్కడే చనిపోయాడు... వెంటనే రోడ్డుమీద జనాలంతా మూగారు... కొందరు లారీ డ్రైవర్ని కిందకీడ్చి దేహశుద్ధి చేయడం మొదలెట్టారు. నేనా జనాల్ని చీల్చుకుంటూ, అతడి శవం పడున్న చోటికెళ్ళాను... అతని ముఖం చూస్తుంటే, సడెన్‌గా గుర్తొచ్చింది నాకు... ఆ రోజు హోటల్ రూఫ్‌లోంచి నాతో మాట్లాడిన తల, ఇతని ముఖమూ ఒకేమాదిరి ఉన్నాయి... ఒకేలాగున్నాయేమిటి, ఒకటే... నో డౌట్... అనుమానం లేదు... ఆ తల, ఈ చనిపోయిన వ్యక్తీ ఒకరే... కాపోతే ఆ రోజు ఒక్క తల మాత్రమే ఉంది... ఇప్పుడు బాడీ అంతా ఉంది, కానైతే ప్రాణం పోయింది...

"ఓ భగవంతుడా, అతని ఆత్మకు శాంతి కలిగించుగాక" అనుకుంటూ నెమ్మదిగా అక్కడినుంచి తప్పుకున్నా... అలా రెండో సంఘటన వివరిస్తుండగానే, మూడు లాంతర్ల జంక్షన్ దగ్గర టీస్టాల్‌కు చేరుకున్నాం... రాంభక్తహనుమాన్‌గాడే అందరికీ టీ సర్వ్ చేశాడు... "ఊ... ఆ తర్వాతేమైంది?" అడిగాడు సాయిబాబా. ఇదంతా జరిగి రెండేళ్ళవుతోంది బాబా... దాదాపు నేనా విషయాన్ని మర్చిపోయాను కూడా... ఇవాల్టి యాక్సిడెంట్‌తో మళ్ళీ ఆ విషయం గుర్తొచ్చింది.

"ఎందుకని?" ప్రశ్నించారు హెడ్మాస్టరు. "ఆ రోజు ఆ యాక్సిడెంట్‌లో చనిపోయిన వ్యక్తే ఇవాళ రోడ్డుమీద పడిపోయిన నన్ను లేపి, జాగ్రత్తగా వెళ్ళమని చెప్పాడు కాబట్టి." నా జవాబుతో అందరికీ ఒక్కసారిగా పొలమారింది. "అదెలా సాధ్యం?" కృష్ణాజీ చాలా క్యూరియస్‌గా అడిగారు... "ఆ భగవంతుడికే తెలియాలి" అంటూ టీ కప్పు రాంభక్తహనుమాన్‌గాడికి అందించాను... నేనా సంఘటన వివరించేసరికి, అందరి ముఖాల్లోనూ మరింత ఉత్కంఠ పెరిగింది...

అందరం మళ్ళీ రాజుగారి హోటల్‌వైపు నడక సాగించాం... నేను తప్పించి అందరూ ఆ సంఘటన గురించే రౌండ్ టేబుల్ సమావేశంలో మాదిరి చర్చించుకోటం మొదలెట్టారు. చినుకులు మళ్ళీ మొదలయ్యాయి, చలిగాలిని తోడేసుకుని... హోటల్ దగ్గరికి రాగానే, నేను నా బండి తీశాను... "గుడ్‌నైట్ ఫ్రెండ్స్... మళ్ళీ రేపు కలుద్దాం" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాను... ఇంతలో సాయిబాబా, "ఆగండి మాష్టారూ..." అన్నాడు... ఏమిటన్నట్లు చూస్తూ స్కూటర్ ఇంజన్ ఆఫ్ చేశాను... "మూడో సంఘటన గురించి చెప్పకుండానే వెళ్ళిపోతారా?" అడిగాడు సాయిబాబా... చిన్నగా నవ్వాను నేను. "కుదరదు... అది కూడా ఇప్పుడు చెప్పాల్సిందే" అంటూ రాజుగారు, కృష్ణాజీ పట్టుబట్టారు... "తప్పదంటారా?" అనడిగా నేను. "తప్పదు" అని స్పష్టం చేశారు హెడ్‌మాష్టారు... కృష్ణాజీ దగ్గర ఓ సిగరెట్ తీసుకుని, లైటర్‌తో వెలిగించి, "ఇప్పటిదాకా మీరు విన్న రెండు సంఘటనలు నిజంగా జరగకపోవడమే మూడో సంఘటన. అదే ఈ కథకు ముక్తాయింపు" అంటూ కూల్‌గా చెప్పాను... అందరూ నావైపు వెర్రిగా చూశారు... ఈలోగా ఆదిగాడు ఉరఫ్ రాంభక్తహనుమాన్ గాడికి డౌట్ వచ్చింది.

"మరదంతా అబద్ధమైతే, యాక్సిడెంట్‌లో మీ చేతికి దెబ్బ తగిలి రక్తమొచ్చిందిగా? అది కూడా అబద్ధమేనా?" ఉక్రోషంగా అడిగాడు వాడు, ఇప్పటిదాకా నేను చెప్పింది కథేనని అనటంతో. "రక్తమెక్కడుంది... కావాలంటే చేయి చూసుకో" అంటూ చెయ్యి చూపించాను... చిత్రం అక్కడ రక్తం లేదు... రాజుగారు ఫస్టెయిడ్ చేసి కట్టిన కట్టూ లేదు... చాలా ప్లెయిన్‌గా ఉంది అంతా. మిత్రులందరూ నావైపు నోరెళ్ళబెట్టి చూశారు...

"మరి ఇందాక యాక్సిడెంట్ జరగలేదా?" సాయిబాబాకి ఇంకా డౌట్ తీరలేదు... "ఏమో? ఎవరికి తెలుసు... మూడు లాంతర్లనడగండి..." అంటూ, అందరికీ మరోసారి గుడ్‌నైట్ చెప్పి స్కూటర్ స్టార్ట్ చేశా. ●

మల్లి: పిన్నిగారూ... మీవారు రైటరట ఏ పత్రికాఫీసులో?
జయ: పత్రికాఫీసులో కాదొదినా... పోలీస్ స్టేషన్లో...

